



అమీన్‌పూర్ మండలం బండ్లగూడకు చెందిన ఓవ్యక్తి తమ వ్యవసాయ భూమిని వారసత్వ ఫౌతి మార్పిడి కోసం ధరణి పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఇందుకు తహసీల్దార్ కార్యాలయంలోని ధరణి ఆపరేటర్, జూనియర్ అసిస్టెంట్లు లంచం డిమాండ్ చేయగా రూ.30వేలు తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కారు.

మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం తిమ్మాపూర్‌కు చెందిన ఓ రైతుకు భూమిని రిజిస్ట్రేషన్ చేయడానికి ధరణి ఆపరేటర్ రూ.20 వేల లంచం అడిగాడు. ఆ రైతు తన వద్ద డబ్బు లేవని మొరపెట్టుకున్నా వినలేదు. చివరకు ఏసీబీ అధికారులకు సమాచారం ఇచ్చి ఆపరేటర్‌ను పట్టించాడు.

ఈ రెండు ఘటనలు ఉమ్మడి మెదక్ జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న పలువురు ధరణి ఆపరేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లపై ఫిర్యాదులకు అద్దం పడుతున్నాయి. కొంతమంది సక్రమంగా రిజిస్ట్రేషన్లకు సహకరిస్తుండగా.. ఇంకొందరు చేయి తడిపితే గాని చేతికి పనిచెప్పడం లేదనే విమర్శలున్నాయి. సాహసించి ఏసీబీ అధికారుల దృష్టికి తీసుకెళితేనే ఇలాంటివి బట్టబయలవుతున్నాయి. లేదంటే దర్జాగా వసూళ్లు కొనసాగిస్తున్నారు.

ఆపరేటర్లకు ధరణి

తహసీల్దార్ కార్యాలయాల్లో వసూల్‌రాజాలు

- కంప్యూటర్, ధరణి ఆపరేటర్లపై ఆరోపణలు
- భూక్రయవిక్రయాల్లో చేతివాటం ప్రదర్శన
- మామూళ్లలో పెద్దసార్లకు మధ్యవర్తిత్వం
- తాజాగా అమీన్‌పూర్‌లో ఏసీబీకి పట్టివేత
- మెదక్, సిద్దిపేట జిల్లాల్లోనూ పలువురిపై ఫిర్యాదులు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, ఆగస్టు4 : సాధారణంగా తహసీల్దార్ కార్యాలయాలపై అవినీతి ఆరోపణలు వ్యక్తమవుతుంటాయి. లంచాలు తీసుకుంటూ అడ్డంగా దొరికిన తహసీల్దార్లు సైతం ఉమ్మడి జిల్లాలో పదుల సంఖ్యలో ఉన్నారు. డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్ఐలు, జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు కూడా ఈ జాబితాలో లేకపోలేరు. వీరి బాటలోనే ధరణి, కంప్యూటర్ ఆపరేటర్లూ నడుస్తున్నారు. ధరణి పోర్టల్‌లో ఉన్న లొసుగులపై పూర్తిస్థాయిలో అవగాహన ఉన్నందున ముందుగానే ధర మాట్లాడుకుంటున్నారు. క్రయవిక్రయదారులు తమ లావాదేవీల గురించి ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకోగానే ఆ సమాచారం ధరణి పోర్టల్‌కు చేరుతున్నది. మ్యుటేషన్, ఫౌతి, రిజిస్ట్రేషన్, పీవోబీ, సీలింగ్ తదితర కార్యకలాపాలకు ధరలు నిర్ణయిస్తున్నారు. అన్నీ సక్రమంగా ఉన్నా ఏదో ఒక మరక అంటిస్తున్నారనే అభియోగాలు సైతం ఉన్నాయి. దీని ఆధారంగా వసూళ్లకు లైన్‌క్లియర్ చేసుకుంటున్న పరిస్థితి నెలకొన్నది.

అక్కడక్కడా వారిదే పెత్తనం

ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఎంపికైన డాటా ఎంట్రీ ఆపరేటర్లు పలు తహసీల్దార్ కార్యాలయాల్లో చక్రం తిప్పుతున్నారు. ఏళ్ల తరబడిగా అక్కడే వేళ్లూనుకొని ఉండడంతో కార్యాలయానికి వచ్చే అధికారులు కూడా వీరి మాటనే వినాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. వివాదాస్పదమైన భూములు, సర్వే నంబర్లను కూడా సక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించే తెలివితేటలు వీరికి ఉండడంతో అధికారులూ ఆపరేటర్ల మాటకు కట్టుబడుతున్నారు. ముఖ్యంగా సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు, అమీన్‌పూర్, రామచంద్రాపురం, జిన్నారం, గుమ్మడిదల, కంది, సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్, ఝరాసంగం, కోహీర్ మండలాలు, సిద్దిపేట జిల్లా ములుగు, వర్గల్, గజ్వేల్, మర్కూక్, సిద్దిపేట అర్బన్, జగదేవ్‌పూర్ మండలాలు, మెదక్ జిల్లా తూప్రాన్, నర్సాపూర్, మాసాయిపేట, మనోహరాబాద్, మెదక్, రామాయంపేట మండలాల్లో భూములకు విలువ ఉంది. ఇక్కడ భూలావాదేవీలకు తహసీల్దార్ కార్యాలయాలపై ఆధారపడాల్సిందే. ఎకరాకు కోట్లలో ధరలు ఉండడంతో రిజిస్ట్రేషన్ల సమయంలో వెనుకంజ వేయకుండా అడిగినంతా ఇచ్చుకుంటున్నారనే పరిస్థితి వినిపిస్తోంది. ఈ మండలాలతోపాటు మరికొన్ని మండలాల్లోనూ ధరణి ఆపరేటర్ల పెత్తనం అంతాఇంతా కాదు. భూముల్లో ఉన్న లోటుపాట్లను గుర్తించి తమ బంధువులు, స్నేహితుల పేరిట కూడా రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నారనే ఆరోపణలూ వ్యక్తమవుతున్నాయి.

స్థానచలనం అవసరమే

రెవెన్యూ శాఖలో అధికారులు, ఉద్యోగులతోపాటు ధరణి, కంప్యూటర్ ఆపరేటర్లకు కూడా రెండేళ్లకోసారి స్థానచలనం కలిగించాల్సిన అవసరం ఎంతైనా ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కీలక అధికారులతోపాటు ఆపరేటర్లపైనా నిఘా ఉంచాలని కోరుతున్నారు. సిద్దిపేట జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాల్లో ఏళ్ల తరబడిగా పాతుకుపోయిన కంప్యూటర్ ఆపరేటర్లను ఇటీవల బదిలీ చేశారు. అందరికీ స్థానచలనం కలిగించి కలెక్టర్ మనూచౌదరి ఒక మార్పు తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. రెండేళ్ల కిందట మెదక్ జిల్లాలోనూ ఇదే విధంగా కొంతమందిని మార్పులుచేర్పులు చేశారు. ఇప్పుడు సంగారెడ్డి జిల్లాతోపాటు మెదక్‌జిల్లాలోనూ ఆరోపణలున్న ఆపరేటర్లను బదిలీ చేసేలా చర్యలు చేపట్టాలనే డిమాండ్ నెలకొంది.

వైద్య కళాశాలకు మరో మూడు పీజీ కోర్సులు

కొత్త కాలేజీలలో 16 పీజీ కోర్సులతో సిద్దిపేట వైద్య కళాశాల రికార్డ్

సిద్దిపేట క్రైం, ఆగస్టు 4 : సిద్దిపేట వైద్య కళాశాలకు మరో మూడు పీజీ కోర్సులు మంజూరు అయినట్లు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సిద్ది పేట మెడికల్ కాలేజీకు గత ప్రభుత్వంలోనే అన్ని వసతులను సమకూర్చుకున్నామని, ఫ్యాకల్టీని ఏర్పాటు చేసుకున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే వైద్య కళాశాలలో 13 పీజీ కోర్సులు, 58 సీట్లు ఉండగా మరో మూడు కొత్తగా మంజురయ్యాయని తెలిపారు. కొత్తగా అనస్తీషియా 6 సీట్లు, పీడియాట్రిక్ 4 సీట్లు, డెర్మాటలాజీ 4 సీట్లు మంజూరయ్యాయని వివరించారు. వీటితో మొత్తంగా 16 కోర్సులు, 72 సీట్లు అందుబాటులో ఉన్నాయని, కొత్త మెడికల్ కాలేజీల్లో సిద్దిపేట మెడికల్ కాలేజీ రికార్డ్ సాధించిందని తెలిపారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు సంతోషం వ్యక్తం చేశారు. ఈ విద్యా సంవత్సరం నుంచే ఈ కోర్సులు అందుబాటులోకి రానున్నాయని పేర్కొన్నారు.

లేఖ అందింది.. రేపటి నుంచి ఎత్తిపోస్తాం

నీటి పారుదల శాఖ సెక్రటరీ రాహుల్ బొజ్జ స్పందన

సిద్దిపేట క్రైం, ఆగస్టు 4 : నీళ్లు లేక వెలవెలబోతున్న జిల్లాలోని రిజర్వాయర్లకు వెంటనే గోదావరి జలాలను ఎత్తిపోసి రైతాంగాన్ని ఆదుకోవాలని రెండు రోజుల క్రితం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు రాసిన లేఖకు ప్రభుత్వం స్పందించింది. ఆదివారం నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా హరీశ్‌రావుతో మాట్లాడారు. మీరు పంపించిన లేఖ అందిందని, రేపటి నుంచి మిడ్‌మానేరు ద్వారా నీటిని ఎత్తిపోస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రకటనపై జిల్లాలోని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మొక్కలే జీవకోటికి ప్రాణాధారం

మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినూత్న ప్రదర్శన



మొక్కల మాస్క్‌తో చిన్నారులు

సిద్దిపేట క్రైం, ఆగస్టు 4 : మొక్కలే జీవకోటికి ప్రాణాధారమని, రాబోయే తరాలకు మనమిచ్చే గొప్ప ఆస్తి వృక్షాలే అని సిద్దిపేట మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు అన్నారు. ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా వారు వినూత్న ప్రదర్శన నిర్వహించారు. మొక్కను ఒక తొట్టిలో పెట్టి దాని నుంచి వచ్చే ఆక్సిజన్‌ను పీల్చుకుంటున్నట్లుగా మాస్క్ ఏర్పాటు చేసి మొక్కల ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వాహనదారులకు మొక్కలు పంపిణీ చేశారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ మంజుల, వన్ టౌన్ ఎస్ఐ నర్సింగరావు, కౌన్సిలర్ రవీందర్ అసోసియేషన్ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.



గజ్వేల్ పట్టణంలో ఇందిరాపార్కు చౌరస్తా నుంచి ఢిల్లీ వాలా హోటల్ రోడ్డుపై కొనసాగుతున్న సంత

సంత.. చింత

- గజ్వేల్‌లో మార్కెట్‌తో ట్రాఫిక్ చిక్కులు
- తరలింపునకు పోలీసుల యత్నం
- చేర్యాలలో చీకట్లో కొనసాగుతున్న వారాంతపు సంత

గజ్వేల్, ఆగస్టు 4 : సంతతో ప్రజలు చింత పడుతున్నారు. గజ్వేల్ పట్టణంలోని ఇందిరాపార్కు చౌరస్తా నుంచి ఢిల్లీ వాలా హోటల్ వరకు ప్రతీ బుధవారం కూరగాయలు, బట్టలు, వ్యవసాయ పనిముట్లు, ప్లాస్టిక్ వస్తువులు, ఆయా రకాల వస్తువులు అమ్ముకుని చిరువ్యాపారులు జీవిస్తుంటారు. గజ్వేల్ పట్టణం, మండలంతో పాటు వర్గల్, ములుగు, మర్కుక్, జగదేవ్‌పూర్, దౌల్తాబాద్, రాయపోల్, చేగుంట, తొగుట, మిరుదొడ్డి, కొమురవెల్లి, యాదాద్రి-భువనగిరి జిల్లా మన్నెవారి తుర్కపల్లి, రాజపేట మండలాలతో పాటు మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా శామీర్‌పేట మండలాలకు చెందిన ప్రజలు ఈ వారసంతకు వస్తుంటారు. దీంతో సంత రోజున ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. ఇదే అదునుగా పిక్‌పాకెటర్లు చేతులకు పనిచెబుతున్నారు. సాధారణ మహిళలు సంతలో నుంచి నడవాలంటే ఇబ్బందులు పడుతున్నారు. వార సంతను మార్కెట్ రోడ్డు నుంచి సంగాపూర్ రోడ్డులోని గోడౌన్ వద్దకు మార్చాలని అధికారులు ప్రతిపాదన చేశారు. ఇటీవల ఆయా శాఖల అధికారులు కలసి క్షేత్రస్థాయిలో పర్యటించి నిర్ణయాన్ని తీసుకున్నారు. ఈ నిర్ణయాన్ని అమలుపరిచేందుకు ఓ శాఖకు చెందిన అధికారులు ముందుకు రాగా మిగిలిన శాఖల అధికారులు స్పందించకపోవడంతో నిలిచిపోయింది. ఈ విషయంలో ఆయా శాఖల అధికారులు పలువురితో కుమ్మక్కైనట్లు తెలుస్తుంది. వారసంత మార్పు విషయంలో నాయకుల నుంచి ఒత్తిడి రావడంతో సదరు శాఖల అధికారులు ముందుకు రాలేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



చేర్యాలలో సెంట్రల్ లైట్లు పనిచేయకపోవడంతో జాతీయరహదారి పక్కన చీకట్లోనే కొనసాగుతున్న సంత

హైవై పక్కన చీకట్లోనే..

చేర్యాల, ఆగస్టు 4 : జాతీయ రహదారుల, మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో చేర్యాల పట్టణంలోని జనగామ-సిద్దిపేట జాతీయరహదారిపై అంధకారం అలముకుంది. 365బి సూర్యాపేట-సిరిసిల్ల జాతీయ రహదారిలో భాగంగా రెండేళ్ల క్రితం జనగామ నుంచి దుద్దెడ వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. ఈక్రమంలో చేర్యాల పట్టణంలో సుమారు రెండు కిలోమీటర్ల మేర గతంలో ఉన్న సెంట్రల్ లైటింగ్ డివైడర్ రెయిలింగ్ నిర్మాణం చేపట్టడంతో పలు ప్రదేశాలలో వెలుతురు నిలిచిపోయింది. పట్టణంలో రాత్రివేళ చీకటి అలముకుంటుంది. ప్రతీ మంగళవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్ సమీపం నుంచి రైతుబజారు సమీపం వరకు రోడ్డు పక్కనే వారాంతపు సంత కొనసాగుతుంది. చిరు వ్యాపారులు, రైతులు రోడ్డు పక్కన ఖాళీ స్థలంలోనే విక్రయాలు జరుపుతున్నారు. జాతీయ రహదారి కావడంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. సంత జరిగే సమయంలో చీకటితో ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉన్నది. ఇప్పటికే రోడ్డుకు ఇరువైపులా చేపట్టిన డ్రైనేజీ కాలువలను పలు చోట్ల అర్ధాంతరంగా వదిలేశారు. దీనికి తోడు జాతీయ రహదారిని అంధకారమయంగా చేయడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలి

రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపు



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్ కడుతున్న కౌన్సిలర్లు

హుస్నాబాద్‌రూరల్, ఆగస్టు 4 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం హుస్నాబాద్ పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 5 నుంచి 9 వరకు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. పరిశుభ్రత, పచ్చదనాన్ని జీవన విధానంలో ఒక భాగం చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రతీ ఒక్కరు ఒక మొక్కనాటి పర్యావరణాన్ని కాపాడేందుకు కృషి చేయాలని కోరారు. స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంత్రి పార్టీ నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కాంగ్రెస్ మున్సిపల్ కౌన్సిలర్లు మంత్రి పొన్నంకు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌ను కట్టారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో ఛైర్మన్ బొలిశెట్టి శివయ్య, పీసీసీ సభ్యులు కేడం లింగమూర్తి, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చిత్తారి పద్మ, సరోజన తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం.. పచ్చదనం

- నేటి నుంచి పల్లెలు, పట్టణాల్లో ప్రత్యేక కార్యక్రమాలు
- 9 వరకు రోజువారీ షెడ్యూల్‌ను విడుదల చేసిన ప్రభుత్వం
- పర్యవేక్షణకు ప్రత్యేకాధికారుల బృందం ఏర్పాటు

సిద్దిపేట అగ్రికల్చర్, ఆగస్టు 4 : స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ఈ నెల 5 నుంచి 9 వరకు పట్టణాలు, పల్లెల్లో వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేయగా కలెక్టర్ మనుచౌదరి అధికారులతో సమీక్షించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు.

తొలి రోజు కార్యక్రమాలు

మొదటి రోజు ప్రారంభం సందర్భంగా ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, యువతతో అవగాహన ర్యాలీలు నిర్వహించాలి. ఇళ్ల నుంచి చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించి, అక్కడ కంపోస్టు ఎరువులు తయారు చేయాలి. పాఠశాలల్లో పారిశుధ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, తోటల పెంపకం, సీజనల్ వ్యాధులు, ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించాలి. మరుగుదొడ్లు లేని ఇళ్లను గుర్తించి, నిర్మింపజేయాలి.

రెండో రోజు.. తాగు నీటి వనరులను శుభ్రం చేయాలి. క్లోరినేషన్ కిట్లను అందుబాటులో ఉంచాలి. తాగునీటి చెరువులు, కుంటలు, కలుషితం కాకుండా స్థానికులకు అవగాహన కల్పించాలి. ఇంకుడు గుంతలు లేని ఇళ్ల వద్ద వాటిని నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలి. తాగునీటి సరఫరా సరిగా లేని ప్రాంతాలను గుర్తించి అక్కడికి శుద్ధనీరు పంపిచేలా చూడాలి.

మూడో రోజు.. మురుగు కాలువల పూడిక తీయించాలి. లోతట్టు ప్రాంతాల్లో నీటి నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి అక్కడున్న నీటిని బయటకు పంపించే ఏర్పాట్లు చేయాలి. గుంతలు ఉన్న ప్రాంతాల్లో మొరం పోసి చదును చేయించాలి. నీరు బయటకు వెళ్లలేని ప్రాంతాల్లో, నీరు నిల్వ ఉన్న చోట ఇంకుడు గుంతలు నిర్మించాలి. చేతి పంపులు, పైప్‌లైన్లు వద్ద మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలి.

నాలుగో రోజు... వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించి సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలి. జ్వర సర్వే నిర్వహించాలి. జ్వరాలు ఎక్కువగా ఉన్న చోట వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలి. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయించాలి. యాంటీ లార్వా రసాయనాలతో పిచికారీ చేయించాలి. ఎనిమల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ) సెంటర్లు ఏర్పాటు చేయాలి. వీధి కుక్కల సంఖ్య తేల్చి ఏబీసీ కేంద్రాలకు తరలించాలి.

ఐదో రోజు.. ప్రతీ మంగళ, శుక్రవారాల్లో డ్రై డేగా పాటించడంపై అవగాహన కల్పించాలి. నీటి నిల్వలను తొలగించాలి. శిథిలావస్థ భవనాలను కూల్చివేయాలి. మోడుబారి కుళ్లిపోయిన చెట్లను తొలగించాలి.

విజయవంతం చేస్తాం : కలెక్టర్ మనుచౌదరి



అన్ని వర్గాల భాగస్వామ్యంతో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేస్తాం. ప్రజలు, యువకులు, ప్రజాప్రతినిధులు, మహిళలు స్వచ్ఛందంగా శ్రమదానంలో పాల్గొనాలి. గ్రామాలు, పట్టణాల్లో షెడ్యూల్ ప్రకారం ప్రతీ కార్యక్రమాన్ని పక్కాగా చేపట్టాలి. కార్యక్రమాన్ని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలి.

ప్రతీ రోజు సమీక్ష

ఈ కార్యక్రమంపై కలెక్టర్ మనుచౌదరి ఏరోజుకు ఆరోజు సమీక్షిస్తూ, నిర్దేశిత లక్ష్యాలను చేరుకునేలా అధికారులను అప్రమత్తం చేస్తారు. పంచాయతీ కార్యదర్శి, ఆశా వర్కర్లు, మరో ముగ్గురితో కూడిన బృందం గ్రామస్థాయి అమలు కార్యక్రమాల్లో బాధ్యత వహించాల్సి ఉంటుంది. పంచాయతీ ప్రత్యేక అధికారి, జిల్లా అధికారులకు ఎప్పటికప్పుడు నివేదిక పంపించాల్సి ఉంటుంది.



ఇటీవల కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో దిశానిర్దేశం చేస్తున్న కలెక్టర్ మనుచౌదరి

రూ.కోటితో జగదేవ్‌పూర్ కేజీబీవీ ఆధునీకరణ

- పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వెంకట్‌నరసింహారెడ్డి



విద్యార్థులతో మాట్లాడుతున్న వెంకట్‌నర్సింహారెడ్డి

జగదేవ్‌పూర్, ఆగస్టు 4 : జగదేవ్‌పూర్‌లోని కేజీబీవీ పాఠశాలను రూ.కోటితో ఆధునీకరిస్తామని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వెంకట్‌నరసింహారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను, భవనాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేజీబీవీ పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకురాగా ప్రతిపాదనలను పంపించాలని ఆయన అధికారులను ఆదేశించారు. వెంటనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. పాఠశాలకు కొత్త రంగులు అద్దడంతో పాటు మౌలిక వసతుల కల్పనకు నిధులు ఇవ్వనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ నిధులతో పాటు సీఎస్ఆర్ ఫండ్స్‌తో జగదేవ్‌పూర్ కేజీబీవీని పాఠశాలను అభివృద్ధి చేస్తామన్నారు. సెలవు దినం కావడంతో విద్యార్థులను చూసేందుకు వచ్చిన తల్లిదండ్రులతోనూ ఆయన ముచ్చటించారు. ఆయన వెంట మండల విద్యాధికారి ఉదయభాస్కర్‌రెడ్డి కేజీబీవీ జీసీడీవో ముక్తేశ్వరి, ఎస్‌వో ఉమామహేశ్వరి, ఉపాధ్యాయులు ఉన్నారు. జగదేవ్‌పూర్ సమగ్ర శిక్ష ఉద్యోగులు పాఠశాల విద్యా డైరెక్టర్ వెంకట్ నర్సింహారెడ్డిని కలిసి మినిమం టైం స్కేల్‌ను అమలు చేయడంతో పాటు రెగ్యులరైజ్ చేయాలని వినతిపత్రం అందజేశారు.

నేడు తహసీల్దార్ కార్యాలయంలో 'ప్రజావాణి'

రేగోడు: రేగోడు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం 10:30 నుంచి మధ్యాహ్నం వరకు ప్రజావాణిని నిర్వహిస్తున్నామని తహసీల్దార్ బాలలక్ష్మి తెలిపారు. భూ సమస్యలపై రైతులు నేరుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

దళితులను విచ్ఛిన్నం చేసే కుట్రలను తిప్పికొడదాం

నారాయణఖేడ్, ఆగస్టు 4: ఎస్సీల వర్గీకరణ పేరిట దళితులను విచ్ఛిన్నం చేసే మనువాద కుట్రలను తిప్పికొడదామని ఖేడ్ నియోజకవర్గంలోని మాలల ఐక్యవేదిక నాయకులు భీంసేన, కొటారి నర్సింహులు, దేవరాజు, శ్రీనివాస్, పండరి, రాము, గౌతం, సురేష్, సంతోష్, నర్సింహులు, విజయ్ తదితరులు పిలుపునిచ్చారు. ఆదివారం ఖేడ్‌లోని అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటుచేసిన డివిజన్ స్థాయి సమావేశంలో వారు మాట్లాడుతూ భవిష్యత్‌లో రాజ్యాంగాన్ని తొలగించే కేంద్రం ప్రభుత్వ కుట్రలో భాగమే వర్గీకరణ అని వారు పేర్కొన్నారు. మాలల ఐక్యత చాటేందుకు 6న ఖేడ్‌లో భారీ ర్యాలీ నిర్వహించనున్నామని తెలిపారు.



ఖేడ్‌లో సమావేశమైన నాయకులు

అప్పుల బాధ, ఆర్థిక ఇబ్బందులతో దినసరి కూలి ఆత్మహత్య

శివ్వంపేట, ఆగస్టు 4: ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ తగాదాలతో దినసరి కూలి పురుగుల మందు సేవించి ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శివ్వంపేట మండలం చెన్నాపూర్‌కు చెందిన గుమ్మల ఆంజనేయులు(40) ఈ నెల 3న మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. అప్పులు ఉండగా ఎందుకు మద్యం సేవించి వస్తున్నావని భార్య ఎల్లమ్మ భర్త ఆంజనేయులును అడిగింది. కోపంతో ఎల్లమ్మను కొట్టడంతో తిమ్మాపూర్‌లో ఉండే ఆడపడుచు ఇంటికి వెళ్లింది. దీంతో ఆంజనేయులు పురుగుల మందు సేవించాడు. గమనించిన ఆంజనేయులు తమ్ముడు రాజు ఎల్లమ్మకు ఫోన్‌చేసి చెప్పగా.. నర్సాపూర్ ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందాడు. భార్య ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న బైక్

● ఇద్దరికి తీవ్రగాయాలు

నర్సాపూర్, ఆగస్టు 4: ఆగి ఉన్న లారీని వెనకనుంచి బైక్‌తో ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. హైదరాబాద్ వైపు నుంచి మెదక్ వైపు వెళ్తున్న లారీ నర్సాపూర్ పట్టణంలో సిగ్నల్ పడడంతో ఆగింది. లారీ వెనకాలే వేగంగా వచ్చిన బైక్ ఢీకొని లారీ కిందికి దూసుకెళ్లిపోయింది. ఈ ఘటనలో లింగాపూర్ గ్రామానికి చెందిన ప్రభు, చిన్న అనే యువకులకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు నర్సాపూర్ ఆస్పత్రికి తరలించారు.

భరతమాతను విశ్వగురువు స్థానంలో నిలబెట్టాలి

● ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత బౌద్ధిక్ జయదేవ్

జహీరాబాద్, ఆగస్టు 4: భరతమాతను విశ్వగురువు స్థానంలో నిలబెట్టాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత బౌద్ధిక్ జయదేవ్ అన్నారు. శనివారం రాత్రి జహీరాబాద్ పట్టణంలోని ఆదర్శ నగర్ పార్కులో తపస్ యూనియన్ ఆధ్వర్యంలో బదిలీపై వెళ్లిన, పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులందరూ విద్యార్థుల్లో దేశభక్తి, దైవభక్తిని, నైతిక విలువలను పెంపొందించే విధంగా కృషి చేయాలన్నారు. వేదాలను వర్గీకరించి మహాభారత అష్టాదశ పురాణాలను రచించి ఎంతో సేవ చేసిన వ్యాసమహర్షి జన్మదినాన్ని గురుపూర్ణిమగా జరుపుకుంటూ.. సద్గురువులను గౌరవించడం మన సాంప్రదాయమని తెలిపారు. అనంతరం జహీరాబాద్, ఝరాసంగం మండల విద్యాధికారులు మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు దత్తాత్రీ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల శ్రేయస్సుకోసం నిరంతరం కృషిచేయాలన్నారు. అనంతరం పదోన్నతులు పొందిన, బదిలీలపై వెళ్లిన ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో తపస్ యూనియన్ నాయకులు నాగేశ్వరరావు, తుక్కప్ప, అడివప్ప, గోపాల్, నర్సింహారెడ్డి, బస్వరాజ్, దశరత్, తుకారాం పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు, ఒకరు మృతి

దుబ్బాక, ఆగస్టు 4: బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. మెదక్ జిల్లా నిజాంపేట మండలం కల్వకుంట్ల గ్రామానికి చెందిన పురుషోత్తం(32) సిద్దిపేట నుంచి (టీఎస్ 15 ఈకే 1120) నెంబరు గల బైక్‌పై గ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో దుబ్బాక మండలం తిమ్మాపూర్ గ్రామ సమీపంలోకి రాగానే మెదక్ డిపోకు చెందిన బస్సు ఢీకొనడంతో పురుషోత్తం అక్కడికక్కడే మృతిచెందాడు. దుబ్బాక ఎస్ఐ గంగరాజు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి బలవన్మరణం

● అత్తింటివారే హత్య చేశారంటూ మృతుడి బంధువుల ఆందోళన


మృతుడి అత్తింటి ఎదుట ఆందోళన చేస్తున్న బంధువులు


కిరణ్(ఫైల్)

చిన్నశంకరంపేట, ఆగస్టు 4: కుటుంబ గొడవలతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని మల్లుపల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకున్నది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 12 ఏళ్ల క్రితం నిజామాబాద్ జిల్లా ధర్మారం గ్రామానికి చెందిన చిటుకుల ఉదయ్‌కిరణ్ (35)కు మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలంలోని మల్లుపల్లి గ్రామానికి చెందిన చిటుకుల ప్రవళికతో వివాహమైంది. ఇల్లరికం అల్లుడిగా రావడంతో అత్తగారింట్లోనే సంసార చేస్తున్నాడు. అతడు గవ్వలపల్లిలోని ఓ రైస్‌మిల్లులో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. అయితే కొన్ని నెలల నుంచి వారి ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో భార్య మందలించడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఉదయ్ కిరణ్ గవ్వలపల్లి గ్రామ శివారులోని డంపింగ్ యార్డు షెడ్‌లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో మృతుడి బంధువులు అత్తింటి వారే హత్య చేశారంటూ ఆరోపిస్తూ గవ్వలపల్లిలో ఇంటి వద్ద ఆందోళన చేశారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు గ్రామంలోని అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని మెదక్ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తల్లి రాణి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు.

మూడు గంటల్లోనే మిస్సింగ్ కేసును ఛేదించిన పోలీసులు

నిజాంపేట, ఆగస్టు 4: మండల పరిధిలోని కల్వకుంట గ్రామానికి చెందిన బాలికలు ఆదివారం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయారు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో వారి ఫోన్‌ను ట్రేస్ చేశారు. హుటాహుటిన వారు ఉన్న స్థలాన్ని కనుక్కుని కుటుంబ సభ్యులకు అప్పగించడంతో ఊపిరిపీల్చుకున్నారు. మూడు గంటల్లోనే మిస్సింగ్ కేసును ఛేదించిన పోలీసులను పలువురు అభినందించారు.






గుమ్మడిదల మండలం బొంతపల్లి వీరన్నగూడెం వీరభద్రస్వామి ఆలయం

● నేటి నుంచి నెలరోజులు ఉత్సవశోభ
● ఏర్పాట్లు పూర్తిచేసిన ఆలయశాఖ

శ్రావణమాసోత్సవాలకు వీరభద్రస్వామి ఆలయం ముస్తాబు

గుమ్మడిదల, ఆగస్టు 4: ఉమ్మడి జిల్లాలోని శైవక్షేత్రాల్లో ఒకటిగా నిలిచిన సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం బొంతపల్లి వీరన్నగూడెం వీరభద్రస్వామి ఆలయం శ్రావణమాసోత్సవాలకు ముస్తాబైంది. ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఆలయాధికారులు, గ్రామ పెద్దలు నిర్ణయించారు. నేటి నుంచి ప్రారంభంకానున్న ఉత్సవాలు నెలరోజుల పాటు వైభవంగా జరగనున్నాయి. ఆలయం చుట్టూ పూలతో అలంకరణ చేశారు. హైదరాబాద్‌కు అతి దగ్గరలో ఆలయం ఉండడంతో భక్తులు వందల సంఖ్యలో వచ్చి పూజలు చేస్తుంటారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఇబ్బందులు కలుగకుండా ఈవో శశిధర్‌గుప్తా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

కొత్త కట్టడాలతో ఆకర్షణీయంగా ఆలయం

గతం కంటే ప్రస్తుతం వీరభద్రస్వామి ఆలయం అభివృద్ధి ఎంతో పురోగతి చెందింది. దాతల సహకారంతో అప్పటి చైర్మన్ గటాటి భద్రప్ప కృషితో రూ.4 కోట్లపైనే నిధులు ఖర్చుచేసి ఆలయం చుట్టూ మూడు రాజగోపురాలు, గర్భగుడి చుట్టూ పాకార మండపం, ప్రత్యేకంగా యజ్ఞశాల, ఆలయ ఖాళీ ప్రాంగణం మొత్తం కొత్తరకం బండలు ఏర్పాటు చేశారు. ఆలయ అభివృద్ధిని చూసి భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

5 నుంచి పూజలు

ఈనెల 5న నుంచి వీరభద్రస్వామి ఆలయంలో ప్రారంభంకానున్న శ్రావణమాస లక్ష బిల్వార్చన పూజలు నెలరోజులపాటు కొనసాగనున్నాయి. ఉదయం 7 గంటలకు బిందు తీర్థం, అభిషేకంతో శ్రావణమాసోత్సవాలను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం గణపతి పూజ, రుత్వికరణ పూజలతో పాటు తీర్థ ప్రసాదాల వితరణ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. స్వామివారిని పూజించుకున్న అనంతరం సత్యనారాయణ వ్రతం, అభిషేకాలు నిర్వహించుకునేందుకు ఆలయ ఆవరణలో ప్రత్యేక మండపంలో ఏర్పాట్లు చేసినట్లు ఆలయాధికారులు తెలిపారు.

ఏర్పాట్లు పూర్తి

బొంతపల్లి వీరన్నగూడెం వీరభద్రస్వామి ఆలయంలో శ్రావణమాసోత్సవాలు 5 నుంచి ప్రారంభంకానున్నాయి. ఉత్సవాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా వసతులు సమకూర్చాం. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలి.

- శశిధర్‌గుప్తా, ఆలయ ఈవో

భక్తజనసంద్రం.. కేతకీ ఆలయం


క్యూలో బారులుతీరిన భక్తులు

ఝరాసంగం, ఆగస్టు 4: దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన కేతకీ సంగమేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఆషాఢమాసం ముగింపు అమావాస్య సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ఆవరణం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఉదయం అమృత గుండంలో స్నానాలు ఆచరించి స్వామి దర్శనం కోసం క్యూలో బారులుతీరారు. ఆలయ ఆవరణలో నవగ్రహాలకు తైలం, నువ్వులు, నల్ల వస్త్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారుల అన్ని ఏర్పాట్లు చేపట్టారు. స్థానిక ఎస్ఐ నరేష్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బందోబస్తు చేశారు. అలాగే మండల పరిధిలోని మాచునూర్ గ్రామ శివారులో గల రామేశ్వర ఆలయంలో ఆదివారం ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి కుటుంబసమేతంగా పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు శాలువా, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు హన్మంతరావుపాటిల్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


మహా మంత్ర హవనంలో పాల్గొన్న భక్తులు

భగళాముఖి ఆలయంలో మహా మంత్ర హవనం

శివ్వంపేట, ఆగస్టు 4: శక్తిపీఠం భగలాముఖి ఆలయంలో అమావాస్య సందర్భంగా ఆదివారం ఆలయ నిర్వాహకులు వెంకటేశ్వరశర్మ, పూజారి సంతోష్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం యాగశాలలో మహా మంత్ర హవనం వైభవంగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని ఒడిబియ్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మాజీ జడ్పీటీసీ పబ్బా మహేష్‌గుప్తా ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో స్థల దాత పబ్బా స్వరూపరమేష్‌గుప్తా, మెదక్ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, భక్తులు పాల్గొన్నారు.

జాడలేని వాన

● ఎండుతున్న పొలాలు
● కాపాడుకునేందుకు అన్నదాతల ప్రయత్నాలు


జంగరాయిలో నెర్రలు బారుతున్న వరి పంట

చిన్నశంకరంపేట, ఆగస్టు 4: ఖరీఫ్ మొదలై రెండునెలలు గడిచిపోతున్నా వరుణుడి జాడ కానరాలేదు. ఈయేడు వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించిన మాటలు రైతులను నిరాశకు గురిచేసింది. మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలంలో అడపాదడపా కురిసిన వానలకు సాగుచేసిన పొలాలు నీరు లేక నెర్రలు బారుతున్నాయి. రోహిణి కార్తె మొదలుకుని నేటికీ సరైన వర్షాలు కురువలేదు. వర్షాలు కురవక పోవడంతో చెరువులు, కుంటల్లో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. జూన్‌లో 176.4 మి.మీ, జూలైలో 141.6 మి.మీ మాత్రమే వర్షం కురిసింది. కాగా ఆగస్టు ప్రారంభమైనా ఇప్పటికీ వర్షం పడలేదు. చిన్నశంకరంపేట మండలంలో అర సెంటీమీటర్ వర్షం కూడా కురువలేదంటే కరువు ఛాయలు ఏ మేరకు ఉన్నాయో అర్థమవుతున్నది. ఈ యేడు 6 ఎకరాలలో సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు వెల్లడించారు.

విద్యుత్ వ్యవస్థకు మెరుగుకు డిస్కం చర్యలు..!

● రూ.25 కోట్లతో 10 సర్కిళ్లలో మరమ్మతు పనులు
● డీటీఆర్‌ల చుట్టూ రక్షణ చర్యలు, విద్యుత్‌స్తంభాలకు సిల్వర్ కలర్
● గ్రేటర్‌లో 11,770 పాయింట్లలో సర్వే నిర్వహించి సమస్యల గుర్తింపు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వ్యవస్థను మరింత పటిష్టంగా మార్చేదిశగా దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చర్యలు ప్రారంభించింది. మెట్రో, రంగారెడ్డి, మేడ్చల్ జోన్లలో 33/11 కేవీ ఫీడర్లు, ఎల్‌టీ విద్యుత్ లైన్ల అభివృద్ధి, మరమ్మతులకు డిస్కం రూ.25 కోట్ల నిధులు కేటాయించింది. గ్రేటర్‌జోన్ పరిధిలోని బంజారాహిల్స్, సైబర్ సిటీ, హబ్సిగూడ, హైదరాబాద్ సెంట్రల్, హైదరాబాద్‌సౌత్, మేడ్చల్, రాజేంద్రనగర్, సంగారెడ్డి, సరూర్‌నగర్, సికింద్రాబాద్ సర్కిళ్లలో 11,770 పాయింట్లలో సర్వే నిర్వహించిన అధికారులు, సిబ్బంది మూడు జోన్ల పరిధిలో ఒరిగిన విద్యుత్ స్తంభాలు, రక్షణ లేని డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, కిందికి వాలిన కండక్టర్లు, రింగ్ మెయిన్ యూనిట్ (ఆర్ఎంయూ)ల వద్ద పలు లోపాలు గుర్తించారు. గుర్తించిన లోపాలు తొలగించి విద్యుత్‌సరఫరా వ్యవస్థను మరింత మెరుగుపరిచే దిశగా చర్యలు తీసుకోవాలని ఈ మేరకు సోమవారం నుంచి మరమ్మతు పనులు ప్రారంభించాలని టీజీఎస్పీడీసీఎల్ సీఎం ముషారఫ్ ఫరూకీ ఉన్నతాధికారును ఆదివారం ఆదేశించారు. జూన్ నెలలో గ్రేటర్‌జోన్ వ్యాప్తంగా 11 కేవీ ఫీడర్లతో పాటు స్తంభాలు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు(డీటీఆర్), విద్యుత్‌లైన్లపై సర్వే నిర్వహించిన పాయింట్ల ఫోటోలను టీజీ ఎయిమ్స్ యాప్‌లో ఇప్పటికే నమోదు చేశారు. వాటి ఆధారంగా పనులు పూర్తిచేసే దిశగా విద్యుత్‌శాఖ చర్యలు చేపడుతుంది. రక్షణ లేని డీటీఆర్‌ల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో పాటు విద్యుత్ స్తంభాలకు సిల్వర్ కలర్ వేయడం, ప్రమాదకరంగా ఉన్న స్తంభాలు తొలగించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. విద్యుత్ మరమ్మతుల పనులు పూర్తిచేసి బిల్లులు పెట్టే క్రమంలో చేసిన పనులు, వాటికి సంబంధించిన ఫోటోలు టీజీఎయిమ్స్ యాప్‌లో అప్‌డేట్ చేయాలని వాటి ఆధారంగా సంబంధిత కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించేదిశగా డిస్కం ప్రణాళికలు రూపొందించింది.

సర్వే చేపట్టిన పాయింట్లు...

- మెట్రో జోన్ - 1,846
- రంగారెడ్డి జోన్ - 3,124
- మేడ్చల్ జోన్ - 6,800
- గ్రేటర్ జోన్ మొత్తం - 11, 770

చికిత్స పొందుతూ యువరైతు మృతి


సురేష్(ఫైల్)

చిన్నకోడూరు, ఆగస్టు 4: గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువరైతు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్ఐ బాలకృష్ణ వివరాల ప్రకారం.. చిన్నకోడూరు మండలం చెర్లఅంకిరెడ్డిపల్లికి చెందిన మోతకాని సురేష్(32) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. కుటుంబ అవసరాల కోసం సుమారు రూ.15 లక్షల వరకు అప్పులు చేశాడు. ఆరునెలల క్రితం 20 గుంటల భూమి అమ్మగా వచ్చిన డబ్బులతో కొంత అప్పు తీర్చాడు. మిగిలిన అప్పు ఎలా తీర్చాలాని తరచూ సురేష్ తన భార్య రేఖకు చెప్పుకుంటూ బాధపడేవాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురై గతనెల 31న ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగి కింద పడుకున్నాడు. ఇంటికి వచ్చిన కుటుంబసభ్యులు గమనించి చికిత్స నిమిత్తం వెంటనే ఓ ప్రైవేట్ వాహనంలో సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్య కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సురేష్ శనివారం అర్ధరాత్రి మృతిచెందాడు. ఆదివారం మృతుడి భార్య రేఖ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా మృతుడికి ఒక కూతురు, కుమారుడు ఉన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య


కనకయ్య(ఫైల్)

చేర్యాల, ఆగస్టు 4: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొమురవెల్లి మండలం గురువన్నపేట గ్రామానికి చెందిన బండారి కనకయ్య(49) గత 30 ఏళ్లుగా హైదరాబాద్‌లో నివాసముంటూ హస్మత్‌పేటలో పాత ఇనుప సామాను వ్యాపారం నిర్వహిస్తున్నాడు. కొన్నేళ్లుగా బీపీ, షుగర్, అల్సర్ వంటి వ్యాధులతో బాధపడుతున్నాడు. శనివారం ఉదయం స్వగ్రామమైన గురువన్నపేటకు చేరుకుని సాయంత్రం గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజుగౌడ్ తెలిపారు.

తప్పిపోయిన చిన్నారి అప్పగింత


తల్లిదండ్రులతో చిన్నారి

చేర్యాల, ఆగస్టు 4: కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ సమీపంలో తప్పిపోయిన మూడేళ్ల పాపను స్థానికుడు పోలీసులకు అప్పగించిన సంఘటన ఆదివారం చోటుచేసుకున్నది. భూపాలపల్లి జిల్లా ఘనపూర్ మండలానికి జన్ను రాజు కుటుంబసమేతంగా మల్లన్న దర్శనార్థం వచ్చారు. ఈ క్రమంలో అతడి మూడేళ్ల కూతురు నిత్యశ్రీ తప్పిపోయి వీధులగుండా ఏడుస్తూ కనిపించడాన్ని గుర్తించిన స్థానికుడు కడమంచి మల్లేశం పాపను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి విషయం తెలిపాడు. దీంతో పోలీసులు ఆలయ మైక్ ద్వారా అనౌన్స్‌మెంట్ చేయడంతో రాణాకు చేరుకున్న తల్లిదండ్రులకు పాపను అప్పగించారు. ఈ మేరకు ఎస్ఐ రాజుగౌడ్ కడమంచి మల్లేశంను అభినందించారు.

రేషన్‌కార్డు లేక.. రుణమాఫీ కాక

● బ్యాంకులు, వ్యవసాయ కార్యాలయాల చుట్టూ అన్నదాతల ప్రదక్షిణలు
● రెండు విడతల్లో ఇదే పరిస్థితి
● కంది రైతువేదిక వద్ద రైతుల ఆందోళన



కంది రైతువేదిక వద్ద ఆందోళన చేస్తున్న రైతులు(ఫైల్)

కంది, ఆగస్టు 4: ప్రభుత్వం అన్నదాతలను ఆదుకునేందుకు ఎంతో ప్రతిష్టాత్మకంగా రైతు రుణమాఫీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గతనెల 18న రూ.ఒక లక్షలోపు ఉన్న రైతులకు, 31న రూ.1.5 లక్షలలోపు రుణాలు ఉన్న రైతులకు రుమాఫీ చేసింది. అయితే ఇప్పుడు రైతు రుణమాఫీకి బ్యాంకుల్లో రేషన్‌కార్డు లింకు అడ్డంకి అయ్యింది. రైతులు రుణాలు తీసుకున్న బ్యాంకుల్లో రుణమాఫీ కావాలంటే రేషన్‌కార్డు లింక్ చేయాల్సిందేనని బ్యాంకు అధికారులు స్పష్టం చేస్తున్నారు. దీంతో కుటుంబానికి ఒక్కటే రేషన్‌కార్డు ఉన్న రైతులు, అసలు రేషన్‌కార్డు లేని మరికొందరు రైతులు ఏం చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. రేషన్‌కార్డు లేక రుణమాఫీ కాక ఎందరో రైతులు ఆవేదనకు గురవుతున్నారు. దీంతో కంది రైతువేదిక వద్ద ఆయా గ్రామాలకు చెందిన పలువురు రైతులు కొన్నిరోజులుగా ఆందోళన చేపడుతున్నారు. రేషన్‌కార్డు లేకున్నా తమకు రుణమాఫీ చేయించాలని వారు డిమాండ్ చేశారు. రుణమాఫీకి కంది మండలంలో మొదటి విడతలో 1,537 మంది రూ.ఒక లక్ష రుణమాఫీకి అర్హులు కాగా, రెండో విడతల రూ.1.5 లక్షల రుణమాఫీకి 597 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరంతా సంగారెడ్డి, కంది పరిధిలో ఉన్న ఎస్‌బీఐ, ఏపీజీవీబీ, డీసీఎంఎస్, గ్రామీణ బ్యాంకులతో పాటు వివిధ బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నారు.

వేధిస్తున్న రేషన్‌కార్డు సమస్య

ఎక్కువమంది రైతులను రేషన్‌కార్డు సమస్య వేధిస్తున్నది. పదేళ్ల క్రితం కొత్తగా ఇచ్చిన రేషన్‌కార్డులు ఉన్నవారికి రుణమాఫీ కావడం రైతన్నలను ఆవేదనకు గురిచేస్తున్నది. పదేళ్ల క్రితం పెళ్లిళ్లై వేరు కాపురాలు పెట్టిన యువ రైతులు బ్యాంకుల్లో రుణం తీసుకుంటే ఆ రుణం మాఫీకి ఇప్పుడు రేషన్‌కార్డు ఆటంకంగా మారింది. రేషన్‌కార్డు ఉంటేనే రుణమాఫీ అవుతుందని బ్యాంకు అధికారులు స్పష్టం చేయడంతో రేషన్‌కార్డు లేని రైతులంతా ఆందోళనకు గురవుతున్నారు. రైతులకు ఉన్న భూమికి సంబంధించి పట్టాదారు పాస్ పుస్తకం ఉంటే రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రేషన్‌కార్డు లేకుండా రుణమాఫీ జరగడం కోసం ప్రత్యేక వ్యవస్థ ద్వారా సర్వే చేపడుతున్నామని వ్యవసాయ అధికారులు తెలిపారు. త్వరలోనే రుణమాఫీకి అడ్డంకిగా ఉన్న రేషన్‌కార్డు లింకు లేకున్నా బ్యాంకుల్లో రుణమాఫీ అయ్యేలా ఉన్నతస్థాయి కమిటీ పని చేస్తుందని వ్యవసాయ అధికారులు వెల్లడించారు.

మా కుటుంబానికి ఒక్కటే రేషన్‌కార్డు ఉన్నది



కంది మండలంలోని జుల్‌కల్ గ్రామంలో మాది ఉమ్మడి కుటుంబం. మా కుటుంబానికి ఒక్కటే రేషన్‌కార్డు ఉన్నది. పదేళ్ల క్రితం రేషన్‌కార్డులు ఇచ్చారు. ఇప్పుడు మా ఇద్దరు కుమారులు పెళ్లిళ్లు చేసుకొని వేరు కాపురాలు పెట్టారు. 2021లో మా కుటుంబంలో నేను, నా భార్య, ఇద్దరు కుమారులు కలిసి తలా లక్ష చొప్పున రూ.4 లక్షలు పంట రుణం తీసుకున్నాం. రేషన్‌కార్డు మాత్రం అందరికీ కలిపి ఒక్కటే ఉండడంతో రెండు విడతల్లో మాకు ఎవ్వరికి ఒక్కపైసా కూడా రుణ మాఫీ కాలేదు. అధికారులు మా సమస్యను పరిష్కరించాలి.

- యూసఫ్, రైతు, జుల్‌కల్

రేషన్‌కార్డు లేదు.. రుణమాఫీ కాదా?



కంది మండలంలోని వడ్డెనగూడతండా పంచాయతీ పరిధిలో ఉన్న కొయ్యగుండు తండా మాది. మాకు నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నది. మా తండా ఏర్పడినప్పటి నుంచి కొత్త రేషన్‌కార్డులు మంజూరు కాలేదు. 2023లో బ్యాంకులో రూ.96 వేలు రుణం తీసుకున్నాను. బ్యాంకు, వ్యవసాయ అధికారుల చుట్టూ పదిసార్లు తిరిగాను. ప్రభుత్వం విడుదల చేసిన రుణమాఫీ రెండు విడతల్లో ఒకటే కారణం రేషన్‌కార్డు లేకపోవడమే. కొత్త రేషన్‌కార్డు ఎప్పుడు వస్తుందో, రుణమాఫీ ఎప్పుడు అవుతుందో అని ఆశగా ఎదురు చూస్తున్నాం. అధికారులు వెంటనే స్పందించి మాకు రుణమాఫీ అయ్యేలా చూడగలరు.

- మోత్యానాయక్, రైతు, కొయ్యగుండుతండా

మల్లన్న ఆలయంలో భక్తుల రద్దీ



మల్లన్న ఆలయంలో పట్నం రచించి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

చేర్యాల, ఆగస్టు 4: కొమరవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయం భక్తజనమయమైంది. స్వామివారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులుమొక్కుబడి తలనీలాలు సమర్పించి ఆలయ కోనేటిలో స్నానమాచరించారు. సంప్రదాయబద్ధంగా మట్టికుండలో బోనంచేసి భక్తిప్రపత్తులతో చలక, నజరు, ముఖ మండప పట్నాలువేసి మొక్కులు తీర్చుకున్నారు. మల్లన్నను దర్శించుకుని ఓడిబియ్యాలు పోసి వేడుకున్నారు. ఎల్లమ్మ దేవతకు బోనం నివేదించి, కల్లు, బెల్లంపానకం సాక పెట్టి ఒడి బియ్యాలు పోశారు. అలాగే పట్నాలు వేసిన భక్తులతో ముఖమండపం, గంగిరేగుచెట్టు ప్రాంగణాలు సందడిగా మారాయి. దర్శనానికి గంట సమయం పట్టింది.

శిథిలావస్థలో ప్రభుత్వ జూనియర్ కళాశాల

- తరగతి గదుల్లో పెచ్చులూడుతున్న స్లాబ్
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

బెజ్జంకి, ఆగస్టు 4: వందలాది మంది విద్యార్థులను విద్యా కుసుమాలుగా తీర్చిదిద్దుతున్న కళాశాల శిథిలావస్థకు చేరుకున్నది. దశాబ్దాల క్రితం నిర్మించిన బెజ్జంకి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యాబుద్ధులు నేర్చుకున్న ఎంతోమంది విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకున్నారు. శిథిలావస్థకు చేరుకున్న కళాశాలలోని తరగతి గదుల్లో స్లాబ్ పైపెచ్చులు ఊడుతుండడంతో విద్యార్థులు భయం భయంగా చదువులను కొనసాగిస్తున్నారు. తరగతి గదుల్లోని గోడలకు పగుళ్లు ఏర్పడడంతో వర్షం కురిసినప్పుడు గదుల్లోకి వర్షం నీళ్లు వస్తున్నాయి. కళాశాల భవనానికి మరమ్మతులు చేపట్టకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

దశాబ్దాల క్రితం నిర్మాణం

బెజ్జంకి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను 40 సంవత్సరాల క్రితం నిర్మించారు. అప్పుడు నిర్మించిన భవనానికి ఇప్పటివరకు ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదు. గదుల్లో స్లాబు పైపెచ్చులు ఊడి కింద పడుతున్నాయి. దీంతో కొన్ని సందర్భాల్లో విద్యార్థులు వరండాలో చదువులు కొనసాగించాల్సిన దుస్థితి నెలకొన్నది. వర్షాలు కురిసినప్పుడు గదుల్లోకి నీళ్లు వస్తుండడంతో గతంలో స్లాబు పైన సిసితో చదును చేసినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది.

కళాశాల ప్రాంగణంలో గడ్డి ఏపుగా పెరిగి విద్యార్థులు క్రీడలు ఆడుకునేందుకు వీలులేకుండా పోయింది. అదనపు తరగతి గదులు నిర్మించాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు పలు సందర్భాల్లో నిరసనలు తెలిపినా, ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు అందజేసినా నేటికి అవి నెరవేరడం లేదు. ఇప్పటికైనా శిథిలావస్థకు చేరుకున్న కళాశాలకు మరమ్మతులు చేపట్టడంతో పాటు అదనపు తరగతి గదులు నిర్మించాలని విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



పగుళ్లు వచ్చిన జూనియర్ కళాశాల భవనం, ఇన్‌సెట్‌లో పెచ్చులూడుతున్న స్లాబ్

మరమ్మతులు చేపట్టాలి



కళాశాల భవనానికి మరమ్మతులు చేపట్టి విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి. ప్రజా ప్రతినిధులు, అధికారులు చొరవ చూపాలి.

– సంగెం మధు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు

అసైన్డ్ భూములకు హక్కులు కల్పించాలి

- అసైన్డ్ భూ సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నందు

మిరుదొడ్డి,ఆగస్టు4: రాష్ట్ర ప్రభుత్వం అసైన్డ్ భూములకు హక్కులను కల్పించాలని అసైన్డ్ భూ సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బైండ్ల నందు డిమాండ్ చేశారు. మిరుదొడ్డిలో ఆదివారం అసైన్డ్ భూముల రైతులతో కలిసి మాట్లాడారు. అసైన్డ్ భూములకు హక్కులను కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెట్టాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ రైతు డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీని నేరవేర్చాలని కోరారు. అసైన్డ్ భూముల చట్టం 1977ను రద్దు చేసి కొత్త చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసైన్డ్ భూముల రైతులు యాదగిరి, ఎల్లం తదితరులున్నారు.

'లద్నూరు, వెల్దండ రిజర్వాయర్లను నింపాలి'



నిరసన తెలుపుతున్న నాయకులు

మద్దూరు, ఆగస్టు 4: మద్దూరు మండలం లద్నూరు రిజర్వాయర్‌తో పాటు నర్మెట్ట మండలంలోని వెల్దండలోని రిజర్వాయర్లను దేవాదుల ప్రాజెక్ట్ ద్వారా తక్షణమే నింపి రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి ఆలేటి యాదగిరి డిమాండ్ చేశారు. మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రైతులతో కలిసి లద్నూరు రిజర్వాయర్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం యాదగిరి మాట్లాడారు. చెరువులు, కుంటల్లో నీళ్లు లేక వెక్కిరిస్తుండడంతో పాటు బోరుబావుల్లో జలాలు అడుగంటిపోయాయన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు ఎల్లస్వామి, రవి, భాస్కర్, కుమార్, రాములు, సత్తయ్య, సిద్ధులు, సుబాజీ, బాబు, కిష్టయ్య, అనిల్ ఉన్నారు.

ఎమ్మార్పీ భవన నిర్మాణంలో నిర్లక్ష్యం

- బీజేపీ మండల అధ్యక్షుడు బాబు

నారాయణరావుపేట, ఆగస్టు4: ఎమ్మార్సీ భవన నిర్మాణంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు పోన్నాల బాబు ఆరోపించారు. మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ఎమ్మార్సీ భవనం పనులను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మండల ప్రజాప్రతినిధుల ఆధిపత్య పోరుతో నిర్మాణం పనులు అపివేశారని ఆరోపించారు. నూతన ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడుస్తున్నా పనుల్లో పురోగతి కనిపించడం లేదని మండిపడ్డారు. మండల కేంద్రం ఏర్పడిన ఇన్ని సంవత్సరాల తర్వాత రూ.40 లక్షలతో మానవ వనరుల అభివృద్ధి కేంద్ర భవనం మంజూరైందని, మండల ప్రజలు, విద్యార్థులు సంతోషం వ్యక్తం చేసేలోపు కొంతమంది మండల మాజీ ప్రజాప్రతినిధుల ఆధిపత్యానికి భయపడి పనులు చేయకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రమేష్‌గౌడ్, ఎమ్మార్పీఎస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి బింగి పవన్, బీజేపీ నాయకులు మొత్యా బుగ్గరాజేశం, స్వామి, సుధాకర్, రాము, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న బీజేపీ, ఎమ్మార్పీఎస్ నాయకులు

గుంతల రోడ్డుతో వాహనదారులకు తిప్పలు

- దశాబ్దాలు గడుస్తున్నా పట్టింపే లేదు
- ఎమ్మెల్యేలు మారినా లభించని మోక్షం

రాయపోల్, ఆగస్టు 4: దశాబ్దాల క్రితం వేసిన తారు రోడ్డు శిథిలమైపోయింది. నలుగురు ఎమ్మెల్యేలు మారినా ఎల్కల్ - బేగంపేట రోడ్డు మాత్రం బాగుపడలేదు. మండలంలోని ఎల్కల్, బేగంపేట గ్రామాలు దుబ్బాక అసెంబ్లీ నియోజకవర్గంలో ఉండగా, దుబ్బాకకు మాత్రం 50 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి, గజ్వేల్‌కు 10 కిలోమీటర్ల దూరంలో ఉంటాయి. గజ్వేల్ నియోజకవర్గం పరిధిలోని బంగ్లవెంకటాపూర్ శివారు వరకు రోడ్డు బాగు చేసి వదిలేశారు. మొన్నటి వరకు గజ్వేల్ నియోజకవర్గ ఎమ్మెల్యే కేసీఆర్ సీఎంగా ఉండటంతో ఆ నియోజకవర్గ పరిధి వరకే అధికారులు రోడ్డును బాగు చేశారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. మరో నాలుగు కిలోమీటర్ల రోడ్డు బాగుచేస్తే ఎల్కల్, బేగంపేట వరకు ప్రయాణికుల ఇబ్బందులు తప్పేవి. కానీ ఈ గ్రామాలు దుబ్బాక నియోజకవర్గం పరిధిలోవి కావడంతో ఎవరూ పట్టించుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో దుబ్బాక నియోజకవర్గ ఎమ్మెల్యేలుగా ముత్యంరెడ్డి, రామలింగారెడ్డి, రఘునందన్‌రావు గెలుపొందగా ఇటీవల కొత్త ప్రభాకర్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఈ రోడ్డు బాగు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు పలుమార్లు ఎమ్మెల్యేలు, అధికారులకు విజ్ఞప్తి చేసినా ఫలితం దక్కలేదు. ఇప్పటికైనా ఈ రోడ్డును బాగు చేయించి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



ధ్వంసమైన రోడ్డు

మెడల్స్ సాధించిన విద్యార్థులకు అభినందనలు

నారాయణరావుపేట, ఆగస్టు 4: సిద్దిపేటలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో మెడల్స్ సాధించని ఆర్డీఎఫ్ విద్యార్థులను మండలంలోని మాటిండ్ల ఆర్డీఎఫ్ పాఠశాల ప్రిన్సిపాల్ విష్ణుమూర్తి అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. జావెలిన్‌త్రో అండర్ 14లో తమ పాఠశాల విద్యార్థులు దీక్షిత గోల్డ్ మెడల్ సాధించినట్లు తెలిపారు. మరో ఐదుగురు విద్యార్థులు రజిత పతకాలు గెలుచుకున్నారన్నారు. మెడల్స్ సాధించిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించినట్లు తెలిపారు.

'చెట్లను రక్షిస్తేనే సంపూర్ణ ఆరోగ్య సమాజం'



సిద్దిపేట క్రైం: ఔషధ మొక్కలను చూపుతున్న యోగా సభ్యులు

సిద్దిపేట క్రైం/చేర్యాల, ఆగస్టు 4: చెట్లను రక్షించడం, యోగాను జీవితంలో భాగం చేసుకుంటే సంపూర్ణ ఆరోగ్య సమాజం ఏర్పడుతుందని సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్, భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు తోట అశోక్ పేర్కొన్నారు. సిద్దిపేటలోని శ్రీనివాస ధ్యాన మందిరంలో ఆదివారం మూలికల దినోత్సవంలో భాగంగా మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రముఖ యోగగురువు, రాష్ట్ర యోగా అధ్యయన పరిషత్ సభ్యుడు తోట సతీష్ మాట్లాడుతూ.. యోగను నేర్చుకోవాలని, సాధన చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పతంజలి యోగ సమితి చీఫ్ ప్యాట్రన్ అంజయ్య, బీఎస్‌టీ ప్రధాన కార్యదర్శి రాములు, ఆర్గనైజింగ్ కార్యదర్శి నరసింహులు, సోషల్ మీడియా ప్రభారి మనోహర్, స్వామి, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి, వన సంరక్షకులు జ్ఞానేశ్వర్, యోగ గురువులు తోట సంధ్య, బసవరాజ్‌కుమార్, మనీషా, సింధూరి, సాయితేజ, ఉమాదేవి, శారద, మంజుల, కవిత తదితరులు పాల్గొన్నారు. చేర్యాల మునిసిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని 6,7,8 వార్డులలో ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మునిసిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి మాట్లాడారు. నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని, పట్టణాన్ని హరితమయం చేసేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు యాట కనకవ్వ, జుబేదా కాటూన్, మునిసిల్ మేనేజర్ ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా

గజ్వేల్, ఆగస్టు 4: టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పదవికి ఏ.మల్లికార్జున్ రాజీనామా చేశారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు విజయేందర్‌రెడ్డికి ఆదివారం రాజీనామా లేఖను అందజేశారు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో ఎస్టీటీ ఉపాధ్యాయులకు జరుగుతున్న అన్యాయంపై రాష్ట్ర శాఖ సరైన రీతిలో స్పందించలేదని, పలు మార్లు రాష్ట్రశాఖ దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లినప్పటికీ, ఫలితం లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. టీపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి పదవికి, టీపీటీఎఫ్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తనకు ఇన్ని రోజులు సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

చేర్యాల, ఆగస్టు 4: చేర్యాల మండలం కడవేరుగుకు చెందిన కొయ్యడ యాదయ్య వెన్నెముఖ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. మాజీ ఎంపీటీసీ గదరాజు యాదగిరి, బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి గదరాజు చందు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.60వేలు మంజూరు చేయించగా, ఆదివారం చెక్కును యాదయ్యకు అందజేశారు.

ఆర్థిక సహాయం అందజేత

చిన్నకోడూరు, ఆగస్టు 4: మృతిచెందిన మిత్రుడి కుటుంబానికి బాల్య మిత్రులు ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని గోనెపల్లికి చెందిన తాళ్లపెల్లి రాజుగౌడ్ (36) ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. చిన్నకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆతడితో పాటు పదోతరగతి (2004-05 బ్యాచ్) చదువుకున్న మిత్రులు ఆదివారం అతడి కుటుంబ సభ్యులకు రూ. 30,500 నగదు, 50 కేజీల బియ్యాన్ని అందజేశారు.

మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌కు మాతృవియోగం

చేర్యాల, ఆగస్టు 4: చేర్యాల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు పుర్మ ఆగంరెడ్డి మాతృవియోగం పొందారు. అతడి తల్లి పుర్మ రాధమ్మ (78) ఆదివారం అనారోగ్యంతో మృతిచెందారు. ఈమేరకు జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేసి నివాళులర్పించారు. పట్టణాధ్యక్షుడు మంచాల చిరంజీవులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తడక లింగమూర్తి, పాల లక్ష్మీనారాయణ, వంగ కృష్ణారెడ్డి, నాయకులు ఊట్లపల్లి శ్రీనివాస్, దాసరి శ్రీకాంత్‌తో పాటు ఇతర పార్టీల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

12న ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ వేడుకలు

నారాయణఖేడ్, ఆగస్టు 4: ఈనెల 12న ఏఐఎస్ఎఫ్ 88వ ఆవిర్భావ వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించాలని ఆ సంఘం జిల్లా నాయకులు సీహెచ్ అశోక్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. చదువు, పోరాడు, సాధించు అనే నినాదంతో సంఘం విద్యార్థులు, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం గత 88 సంవత్సరాలుగా దేశవ్యాప్తంగా పోరాడుతుందన్నారు. విద్యార్థులు, మేధావులు, అధిక సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడిగా బిక్షపతినాయక్

సిద్దిపేట క్రైం, ఆగస్టు 4: బీజేపీ గిరిజన మోర్చా సిద్దిపేట జిల్లా అధ్యక్షుడిగా దూళిమిట్ట మండలానికి చెందిన ధారావత్ బిక్షపతినాయక్ నియామకమయ్యారు. ఈ మేరకు ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి పార్టీ కార్యాలయంలో నియామకం పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ఉమారాణి, మీడియా సెల్ జిల్లా కన్వీనర్ గోనె మార్కండేయులు తదితరులున్నారు.

బీజేపీ కిసాన్ మోర్చా సోషల్ మీడియా జిల్లా కన్వీనర్‌గా బైతి తిరుపతి

సిద్దిపేట రూరల్, ఆగస్టు4: బీజేపీ కిసాన్ మోర్చా సోషల్ మీడియా సిద్దిపేట జిల్లా కన్వీనర్‌గా సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్‌కు చెందిన బైతి తిరుపతి నియామకం అయినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు అన్నసారం సురేష్‌గౌడ్ ఆదివారం తెలిపారు. సోషల్ మీడియా కన్వీనర్‌గా తనను నియమించినందుకు కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు సత్తు తిరుమల్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు సురేష్‌గౌడ్‌కు బైతి తిరుపతి కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ బీసీసెల్ మండల అధ్యక్షుడిగా లోకేష్



లోకేష్‌ను అభినందిస్తున్న తూంకుంట నర్సారెడ్డి

జగదేవ్‌పూర్, ఆగస్టు 4: జగదేవ్‌పూర్ మండలం కాంగ్రెస్ బీసీసెల్ అధ్యక్షుడిగా తిగుల్‌కు చెందిన యూత్ నాయకుడు పన్నీరు లోకేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లో ఆదివారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి హాజరయ్యారు. నర్సారెడ్డి సమక్షంలో మండల బీసీసెల్ కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు లక్ష్మారెడ్డి, మచ్చేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, ఉప్పల ప్రవీన్‌కుమార్, దాసు, శ్రావణ్, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ కమీషన్ ఏజెంట్స్ నూతన కార్యవర్గం ఎన్నిక

ములుగు, ఆగస్టు 4: వంటిమామిడి మార్కెట్ కూరగాయల కమీషన్ ఏజెంట్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నట్లు గౌరవ అధ్యక్షుడు మల్లగౌడ్ తెలిపారు. అధ్యక్షుడిగా తిగుళ్ల కుమార్, ఉపాధ్యక్షులుగా శివకుమార్‌గౌడ్, శేఖర్, ప్రధాన కార్యదర్శిగా రామచంద్రం, సంయుక్త కార్యదర్శిగా ఎండీ. కాజా పాషా, కోశాధికారిగా శివప్ప, ప్రధాన కార్యదర్శిగా శంకర్, కార్యవర్గ సభ్యులు స్వామి, మల్లేష్, సంజీవరెడ్డి, అశోక్, మల్లేష్‌యాదవ్, కరుణాకర్, రాజు, శ్రీకాంత్, జగన్మోహన్, నర్సింహులుగౌడ్, శ్రీనివాస్, ప్రవీన్‌లను ఎన్నుకున్నారు.

ప్రత్యేకాధికారుల పాలనలో కుంటుపడుతున్న అభివృద్ధి

- సర్పంచుల పాలనే నయం అంటున్న ప్రజలు
- చిరుజల్లులకే నీరు నిలుస్తున్న రహదారులు



గుంతల్లో నీరు చేరి అధ్వానంగా నల్లపోచమ్మ రోడ్డు

నంగునూరు, ఆగస్టు 4: చిరుజల్లులకే రోడ్లన్నీ చిత్తడౌతున్నాయి. గ్రామాల్లో సర్పంచ్ వ్యవస్థ లేకపోవడంతో ప్రజా సమస్యలు పట్టించుకునేవారు లేకుండాపోయారు. సర్పంచులు ఉన్న సమయంలో ప్రజలకు ఏదైనా సమస్య వస్తే వెంటనే పరిష్కారం అయ్యేది, ప్రత్యేకాధికారుల పాలనలో కనీసం చుట్టం చూపులాగా కూడా అధికారులు రావడం లేదు. ఒకవేళ వచ్చినా ఆఫీసు వరకే పరిమితమై వెళ్తున్నారు. ఇక పంచాయతీ కార్యదర్శులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారే తప్ప ప్రజా సమస్యలపై దృష్టి సారించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. ఎటు చూసినా పిచ్చి మొక్కలు, గడ్డి పెరిగి దోమలు విజృంభిస్తున్నాయి. మండల కేంద్రంలోని నంగునూరు నుంచి నల్ల పోచమ్మ రోడ్డు వెళ్లే దారి చిరుజల్లులకే బురదమయంగా మారింది. గ్రామపంచాయతీలో నిధుల కొరత వల్ల కనీసం తట్టెడు మట్టి కూడా పోయించలేని దుస్థితి. గ్రామ శివారులోని చింతలకిష్టయ్య ఇంటి వద్ద ఆరు నెలలుగా గుంతలు ఉన్నప్పటికీ పూడ్చక పోవడం పట్ల గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ దారిలో వెళ్లాలంటేనే వాహనదారులు జక్కుతున్నారు. ఇప్పటికైనా ప్రత్యేకాధికారులు పట్టించుకుని సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

నెరవేరిన దశాబ్దాల కల

- సుప్రీం తీర్పు పట్ల నాయకుల హర్షం

ములుగు, ఆగస్టు 4: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం సంతోషంగా ఉందని బీజేపీ ములుగు మండలం ఎస్సీ మోర్చా అధ్యక్షుడు అనంగల్ల కృష్ణ పేర్కొన్నారు. మండలంలోని వంటిమామిడిలో ఆదివారం ప్రధాని నరేంద్రమోదీ, మంద కృష్ణ మాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి కట్టా భాగ్యలక్ష్మి, జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి తలారి లక్ష్మణ్, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు దుర్గం మహేశ్‌గౌడ్, మండల అధికార ప్రతినిధి గాడిపల్లి నరసింగరావు, ఎమ్మార్పీఎస్ ములుగు మండల అధికార ప్రతినిధి మహేశ్, శక్తి కేంద్రం ఇన్‌చార్జి హరికృష్ణ, బూత్ అధ్యక్షులు నల్ల నరేష్, ఎలిగేటి అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

- **మర్కుక్:** సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇవ్వడాన్ని స్వాగతిసూ మండలంలోని ఎర్రవల్లిలో మందకృష్ణ మాదిగ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు గీసు మల్లేశం, తాజా మాజీ సర్పంచ్ బిక్షపతి, స్వామి, బాబు, దీపీదు, పరుశురాములు, లక్ష్మయ్య, భూమయ్య తదితరులు ఉన్నారు.



చిన్నకోడూరు: రామునిపట్లలో ర్యాలీ నిర్వహిస్తున్న అంబేద్కర్ సంఘం, ఎమ్మార్పీఎస్ నాయకులు

- **మిరుదొడ్డి:** ఎస్సీ వర్గీకరణ ఆమోదయోగ్యమేనట్టు సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ మిరుదొడ్డిలో ఎమ్మార్పీఎస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలను వేశారు. 30సంవత్సరాల కళ సకారం అయిందని హర్షంవ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఉన్నారు.

మాటలతో మభ్యపెడుతున్న ప్రభుత్వం

- తపస్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనాకర్‌రెడ్డి

సిద్దిపేట క్రైం, ఆగస్టు 4: ప్రభుత్వం ఏర్పడి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు మాటలు తప్ప చేతుల్లో పనితనం చూపెట్టడం లేదని, ఒక్క డీఏ కూడా ప్రకటించలేదని తపస్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనాకర్‌రెడ్డి ఆరోపించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని స్థానిక శిశు మందిర్‌లో జిల్లా అధ్యక్షుడు ఊడెం రఘువర్ధన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభ్యత్వ అభియాన్ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న డీఏలను చెల్లించాలని కోరారు. ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత మంచి పీఆర్సీతో ఉద్యోగుల ఆశలు నెరవేరుస్తామన్న ప్రభుత్వం ఇప్పటి వరకు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లను కల్పించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. అదేవిధంగా మిగిలిన సమస్యల పరిష్కారానికి కూడా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అభినందన సభలో ఉపాధ్యాయులకు సంతృప్తికరమైన ప్రకటనలు లేకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మురళి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మహేందర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు వైవి. శశికుమార్, శ్రీనివాస్‌రెడ్డి, రామ్‌రెడ్డి, జిల్లా కార్యదర్శులు లింగమూర్తి, వేణుగోపాల్, లోకేష్‌రెడ్డి వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులు వెంకట్‌రామ్‌రెడ్డి, జైపాల్‌యాదవ్, రాములు, మల్లేశం, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనాకర్‌రెడ్డి

ఆత్మీయ సమ్మేళనం



పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 2004 పదో తరగతి చదివిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం చేసుకున్నారు. ఆ నాటి ఉపాధ్యాయులను సన్మానించారు.

– సిద్దిపేట క్రైం



మహాసముద్రం ప్రాంతంలో బీఆర్ఎస్ కార్యకర్తలు, స్నేహితులతో నిర్వహించిన స్నేహితుల దినోత్సవంలో మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేశారు.

– హుస్నాబాద్‌రూరల్



మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2007-08లో పదోతరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. 17 సంవత్సరాల తర్వాత ఒక చోట చేరి సంతోషంగా గడిపారు.

– నారాయణరావుపేట



గజ్వేల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1990-94లో చదువుకున్న విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు జ్ఞాపికలను అందజేశారు.

– గజ్వేల్



జగదేవ్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1985-90లో చదువుకున్న విద్యార్థులు మండలంలో రిమ్మనగూడలోని ఓ ఫాంహౌజ్‌లో ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు.

– గజ్వేల్/జగదేవ్‌పూర్

విద్యాశాఖ డైరెక్టర్‌ను కలిసిన నాయకులు



విద్యాశాఖ డైరెక్టర్ వెంకట నరసింహారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

జగదేవ్‌పూర్, ఆగస్టు 4: రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వెంకట నరసింహారెడ్డిని పీఆర్టీయూ సిద్దిపేట జిల్లా నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. జగదేవ్‌పూర్‌లోని కేజీబీవీ తనిఖీకి వచ్చిన ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు శశిధరశర్మ, గజ్వేల్ మండల అధ్యక్షుడు గూడెం వేమారెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, శేఖర్, పబ్బ వెంకటేష్, నాగరాజు, లింగం తదితరులు ఉన్నారు.

వయనాడ్ బాధితుల కోసం విరాళాల సేకరణ

నంగునూరు,ఆగస్టు 4: ఇటీవల భారీ వర్షాలతో నష్టపోయిన కేరళ రాష్ట్రం వయనాడ్ వరద బాధితులకి చేయూతనందించడానికి ఆదివారం సీఐటీయూ నంగునూరు మండల శాఖ ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ మాట్లాడుతూ.. వరద బాధితుల కుటుంబాలకు చేయూతను అందించడానికి సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విరాళాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు రాజమౌళి, చిట్యాల కనకయ్య, రవీందర్, బాలయ్య, నరసింహులు, శ్రీనివాస్, పరుశురాములు, లక్ష్మయ్య, నరసవ్వ, కలవ్వ, లక్ష్మి, కనకవ్వ రాజ మల్లయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

త్రిపుల్‌ఆర్‌ను వెంటనే నిలిపివేయాలి

- ఇటిక్యాల మాజీ ఎంపీటీసీ భాస్కర్

మర్కుక్, ఆగస్టు 4: త్రిబుల్‌ఆర్‌ను వెంటనే నిలిపివేయాలని ఇటిక్యాల మాజీ ఎంపీటీసీ భాస్కర్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. రైతులు ఎన్ని కష్టాలు వచ్చినా అమ్ముకోకుండా కాపాడుకుంటున్న భూమిని కార్పొరేట్ కంపెనీల కోసం, బడా వ్యాపారుల కోసం లాక్కోవడం తగదన్నారు. 30 కి.మీ దూరంలోనే శామీర్‌పేట్ రింగ్ రోడ్డు ఉందని, ఇంత దగ్గరలో మరో కొత్తరింగు రోడ్డు నిర్మించడం వల్ల ప్రజలకు ఏం లాభం అన్ని ప్రశాంచారు. కార్యక్రమంలో రాంరెడ్డి, నర్సింహులు, లక్ష్మయ్య, బాల్‌నర్సయ్య, జోసెఫ్, గాలేష్, అనిల్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న భూ బాధితులు

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- తొగుట సీఐ లతీఫ్

కొండపాక, ఆగస్టు 4: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తొగుట సీఐ లతీఫ్ సూచించారు. మండలంలోని వెలికట్టలో ఆదివారం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలు వాడటంతో జీవితాలు నాశనం అవుతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

చేర్యాల ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన నీరేశ్

చేర్యాల, ఆగస్టు 4: చేర్యాల ఎస్ఐగా పి.నీరేశ్ బాధ్యతలు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ రికార్డుల్లో సంతకాలు చేసి విధులల్లో చేరారు. ఇక్కడ పనిచేస్తున్న దామోదర్‌ను మర్కూక్‌కు బదిలీ చేయగా, ఆయన స్థానంలో నీరేశ్‌ను ఇటీవల నియమించారు.

